29)నాట/రాగమాలిక

ప॥ రాముడు లోకాభిరాముడందరికి రక్షకు డీతని దెలిసి కొలువరో।
కామిత ఫలదుడు చరాచరములకు గర్తయైన సర్వేశ్వరుడితడు॥

చ॥ తలప దశరథుని తనయుడట తానె తారక బ్రహ్మట।
వెలయ మానుషపు వేషమట వెగటు హరువిల్లు విరిచెనట।
అలరగ తానొక రాజట పాదాన నహల్య శాపము మాన్పెనట।
సొలవక దైవిక మానుషలీలలు చూపుచు మెరసీ జూడరో యితడు॥

చ॥ జగతి వసిష్ఠుని శిష్యుడట జటాయువుకు మోక్షమిచ్చెనట।
అగచరులే తనసేనలట అంబుధి కొండల గట్టెనట।
మగువ కొరకుగానట కమలాసను మనుమని రావణు జంపెనట।
తగలౌకిక వైదికములు నొక్కట తానొరించీ జూడరో యితడు॥

చ॥ వెస నమరుల వరమడిగెనట విభీషణ పట్టము గట్టెనట।
యెసగ నయోధ్యకు నేలికట యింద్రాదులకు గొలువిచ్చెనట।
పొసగ శ్రీవేంకటగిరి నివసమట భువనము లుదరంబున ధరించెనట।
సుసరపు సూక్ష్మాధికములు తనందు జూపుచున్నాడు చూడరో యితడు॥